న్యూ ఇయర్ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన వీధుల్లో యువకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మహిళలు తమ ఇళ్ల ముందు ముగ్గులు వేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగం కుమార్, ఇల్లంతకుంటలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, ఎల్లారెడ్డిపేటలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు.

– సాక్షి నెట్‌వర్క్


ముగ్గుతో కొత్త సంవత్సరానికి స్వాగతం


చీర్లవంచలో కేక్ కట్ చేస్తున్న సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు


తిప్పాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపీ ప్రభాకర్, ఆది శ్రీనివాస్


ముస్తాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


కేక్ కట్ చేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు

క్లుప్తంగా

సీపీఐ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

బోయినపల్లి: జిల్లా కేంద్రంలో ఈ నెల 3న నిర్వహించే బద్దం ఎల్లారెడ్డి వర్ధంతి బహిరంగ సభను విజయవంతం చేయాలని రూపొందించిన పోస్టర్‌ను ఆదివారం మండలంలోని కొదురుపాక గ్రామంలో సీపీఐ నాయకులు ఆవిష్కరించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద మొత్తంలో ప్రజలు పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మంద సుదర్శన్, మీస లక్ష్మణ్, శ్రావణపెల్లి మల్లేశం, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జూలపెల్లి శ్రీనివాస్, కత్తెరపాక రాజయ్య, సుద్దాల రాములు, లక్కె దుర్గయ్య పాల్గొన్నారు.

జాతీయ మహాసభలు జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: బెంగళూరులో నిర్వహించే ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఆవునూరి ప్రభాకర్, ఎంఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ కానాపురం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలన్నారు. ఇందులో భాగంగానే బెంగళూరులో నిర్వహించే జాతీయ మహాసభకు జిల్లాలోని ఎంఎస్పీ, ఎంఆర్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్, గుండా థామస్, బోలారం చంద్రమౌళి, నర్సయ్య, సురేశ్, శ్రీనివాస్, దేవరాజు, కమలాకర్ పాల్గొన్నారు.

రాజన్న సాక్షిగా ప్రమాణం చేయండి



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ సెస్ డైరెక్టర్ స్థానం కోసం బీఆర్‌ఎస్ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడలేదని ధర్మగుండంలో స్నానం చేసి తడి బట్టలతో రాజన్న సాక్షిగా ప్రమాణం చేయాలని వేములవాడ రూరల్ సెస్ డైరెక్టర్ అభ్యర్థి, బీజేపీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి సవాల్ చేశారు. వేములవాడ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ఆ పార్టీకి తగ్గుతున్న ఆదరణ చూసి ఆ నాయకులు మితిమీరి మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. అనంతరం వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

పశువైద్యశాలల ఏర్పాటు కలేనా..?

- 26 గ్రామాలకు ఒకే పశువైద్యశాల
- ప్రతిపాదనలకే పరిమితమైన ఏర్పాటు
- మూగజీవాలకు అందని ద్రాక్షగా వైద్యం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు

ఇల్లంతకుంట: మూగజీవాలకు వైద్యం అందని ద్రాక్షగానే మారుతోంది. ఇల్లంతకుంట మండలంలో మొత్తం 33 గ్రామపంచాయతీ పరిధిలో 15 వరకు అనుబంధ గ్రామాలున్నాయి. ఇందులో గాలిపల్లి మినీ పశువైద్యశాల పరిధిలో పొత్తూరు, నర్సక్కపేట, తాళ్ళపల్లి, వంతడుపుల, గాలిపల్లి, తాళ్ళపల్లి, పత్తికుంటపల్లి గ్రామాలు ఉన్నాయి. ఇల్లంతకుంట పశువైద్యశాల పరిధిలో 26 గ్రామాలకు కేవలం ఒక పశువైద్యశాల మాత్రమే ఉండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇల్లంతకుంట పశువైద్యశాల పరిధిలోని దాచారం, పెద్దలింగాపూర్, సిరికొండ, అనంతగిరి, తెనుగువాండ్లపల్లి, రేపాక గ్రామాలు సుమారు 13 కిలోమీటర్ల దూరం ఉండటంతో పశువులకు వైద్యం అందడం ఇబ్బందికరంగా మారింది.

ఇల్లంతకుంట మండలంలో 63 వేల గొర్రెలు, మేకలతో పాటు, 12 వేల ఎద్దులు, గేదెలు, ఆవులున్నాయి. పశువులకు ఏదైనా ఆపద సమయంలో వైద్యం అందించాలంటే సిబ్బందికి కూడా దూరం వెళ్లి వైద్యం అందించడం, అక్కడ సరైన సదుపాయాలు లేకపోవడంతో ఇటు సిబ్బంది, అటు రైతులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం సీజన్ కావడంతో పశువులకు, గొర్రెలు, మేకలకు వ్యాధులు


ఇల్లంతకుంట పశువైద్యశాల

ప్రబలుతుండటంతో గ్రామాల్లోకి వెళ్లి వైద్యం అందించాలంటే పశువైద్య సిబ్బందికి కత్తిమీద సాములా మారుతోంది.

ప్రతిపాదనలకే పరిమితమా?

ఇల్లంతకుంట పశువైద్యశాల పరిధిలో 26 గ్రామాలు ఉండటంతో పశువైద్యం అందక మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని 2012 నుంచి ప్రజాప్రతినిధులు, పశువైద్య అధికారులు సైతం ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు వందల సార్లు వినతిపత్రాలు ఇచ్చారు. మూడు గ్రామాల్లో పశువైద్యశాలలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటనలు చేసిన కూడా ఇప్పటి వరకు వల్లంపట్ల, రేపాక, పెద్దలింగాపూర్ గ్రామాల్లో పశువైద్యశాల ఏర్పాటు కలగానే మిగిలిపోతుంది. ఈ మూడు గ్రామాల్లో పశువైద్యశాలలు ఏర్పాటు చేస్తే మూగజీవాలకు మెరుగైన వైద్యం అందుతుందని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించి మూడు గ్రామాల్లో పశువైద్యశాలలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు తప్పని తిప్పలు

ఇల్లంతకుంట పశువైద్యశాల పరిధిలో ఉన్న 26 గ్రామాల్లో పెద్దలింగాపూర్, రేపాక, సోమారంపేట, తెనుగువాండ్లపల్లి, సిరికొండ, అనంతగిరి, రామోజిపేట, ఓబులాపూర్, వెల్జిపూర్, కందికట్కూర్, చిక్కుడువానిపల్లి, తిప్పాపూర్ గ్రామాలు మండల కేంద్రానికి 10 కిలోమీటర్లకు పైగానే దూరం ఉండటంతో ఈ గ్రామాల రైతులు పశువులను ఇల్లంతకుంటకు ఆటోలు, టాటా ఏస్ వాహనాల్లో తీసుకురావాలంటే రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు ఖర్చు అవుతోందని రైతులు వాపోతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



ఇల్లంతకుంట పశువైద్యశాల పరిధిలో 26 గ్రామాలున్నాయి. ఇందులో పది గ్రామాలు మండల కేంద్రానికి దూరంగా ఉన్నాయి. పశువులకు ఏదైనా ఆపద వస్తే వైద్యం అందించడం ఇబ్బంది అయినా తప్పనిసరి పరిస్థితుల్లో వెళుతున్నాం. పెద్దలింగాపూర్, వల్లంపట్ల, రేపాక గ్రామాల్లో పశువైద్యశాల కోసం గతంలోనే ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదు.

– సతీశ్, ఇన్‌చార్జి పశువైద్యాధికారి

సంఘాలు-ఎన్నికలు

రెడ్డి సంఘం కార్యవర్గం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా పొన్నాల బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా చిన్ని రాజేందర్‌రెడ్డి, క్యాషియర్ చంద్రమోహన్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

ముదిరాజ్ సంఘం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల గొల్లపల్లి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా పిట్ల వెంకటస్వామిని ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షుడిగా మధు, కోశాధికారిగా ఆంజనేయులు, సలహాదారులను ఎన్నుకున్నారు.

కోనరావుపేట: స్థానిక ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా దూర్ల నారాయణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పని సత్తయ్య, కార్యదర్శిగా వంకాయల శ్రీనివాస్, కోశాధికారిగా చింతల పర్శరాములు, సలహాదారులుగా బోయిని లింబాద్రి, దండు మొగిలి, బోయిని మల్లేశం,నాగరాజు, చింతమడక నరేశ్ ఎన్నికయ్యారు.

మున్నూరు కాపు సంఘం గ్రామ అధ్యక్షుడిగా మధుకర్

వేములవాడరూరల్: మండలంలోని నాగాయపల్లి మున్నూరు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా చెట్టిపల్లి మధుకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా గోపు దేవయ్య, ప్రధాన కార్యదర్శిగా చెట్టిపల్లి జలేందర్, కోశాధికారిగా చెట్టిపల్లి రవి, కార్యవర్గసభ్యులుగా చెట్టిపల్లి శంకర్, బాపన్న, వెంకటేశం, అంజయ్య, మల్లారెడ్డి, గోపు శ్రీనివాస్ ఎన్నికయినట్లు తెలిపారు.

యాదవ పట్టణ కార్యవర్గం

ముస్తాబాద్: ముస్తాబాద్ పట్టణ శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడిగా చెవుల మల్లేశం యాదవ్ ఏడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పెంజర్ల కల్యాణ్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా శాగ దేవయ్య, కోశాధికారిగా పెంజర్ల పరమేశ్, సంయుక్త కార్యదర్శిగా శాగ మహేశ్, కార్యదర్శులుగా చెవుల రాజు, బిక్షపతి శ్రీనివాస్, పర్శరాములు, ఎల్లయ్య, దేవయ్య, పోషయ్య ఎన్నికయ్యారు.

నేడు ఉత్తర ద్వార దర్శనం

ఎల్లారెడ్డిపేట: స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారి ఉత్తర ద్వార దర్శనం ఉదయం 5 గంటలకు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.

మామిడిపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లిలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి మామిండ్ల దశరథం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సుద్దాలలో కుంకుమ పూజలు

కోనరావుపేట: మండలంలోని సుద్దాల శ్రీచెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదివారం కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అర్చకులు మంగళగిరి లక్ష్మయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా అయ్యప్ప శోభాయాత్ర

ఎల్లారెడ్డిపేట: స్థానిక శ్రీ షిరిడీ సాయి ఆలయంలోని అయ్యప్ప సేవా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మణికంఠుని శోభయాత్రను నిర్వహించారు. మాలధారులు స్వామివారి విగ్రహాన్ని గ్రామపురవీధుల్లో ఊరేగించారు. స్వామివారికి మహిళలు హారతులతో మొక్కులు చెల్లించుకున్నారు. దారిపొడువునా అయ్యప్పస్వాముల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయంలో స్వామివారికి గణపతిపూజ, హోమం, అష్టాభిషేకం, చక్రస్నానం, కలశపూజ, పంచసూక్తలతో అభిషేకం, పడిపూజ కార్యక్రమాలను గురుస్వాములు శ్రీనివాస్, రాజు, అర్చకులు నిర్వహించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పాల్గొన్నారు. ముస్తాబాద్ ఎంపీపీ శరత్‌రావు, భాగ్యశ్రీ, ఎన్నారై సత్యం మాలధారులకు అన్నదానం, అల్పాహారం అందజేశారు.


శోభాయాత్రలో పాల్గొన్న మాలధారులు

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన పీఆర్ ఉద్యోగులు

సిరిసిల్ల: జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణను పంచాయతీరాజ్ ఉద్యోగులు ఆదివారం క్యాంపు ఆఫీస్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పీఆర్ ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ఏపీవో పాపారావు ఉన్నారు. అంతకుముందు సిరిసిల్ల ఎంఈవో దూస రఘుపతి, ఉపాధ్యాయులు అనిల్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కోనరావుపేట ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్ ఉన్నారు.


జెడ్పీ చైర్‌పర్సన్‌కు బొకే ఇస్తున్న పీఆర్ ఉద్యోగులు

పంచాయతీని ముట్టడిస్తాం

తంగళ్లపల్లి: మేజర్ గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామ సమస్యలను పట్టించుకోవడం లేదని సిరిసిల్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చుక్క శేఖర్ ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 2వ వార్డులో మూడు రోజులుగా నల్లా నీరు రావడం లేదని అడిగినందుకు 3వ వార్డులో నీటి సరఫరా నిలిపివేశారని కక్షపూరితంగానే నీటి సరఫరా నిలిపివేసి స్పందించడం లేదని ఆరోపించారు. గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామ సమస్యలపై వెంటనే స్పందించని పక్షంలో గ్రామపంచాయతీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో శనివారం రాత్రి డిసెంబర్ 31 సందర్భంగా స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో ఏఎస్సై ముఖీద్, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబంధుతో అభివృద్ధి

ముస్తాబాద్: రైతుబంధు పథకంతో నేడు వ్యవసాయం అభివృద్ధి చెంది ధాన్యం ఉత్పత్తి పెరిగిందని రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు అన్నారు. ముస్తాబాద్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో గోపాల్‌రావు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఇక్కడి భూముల విలువ పెరిగిందన్నారు. రైతులకు ఉచిత కరెంట్, రుణమాఫీ, గోదావరి జలాల తరలింపు, ధాన్యం సేకరణ, గిట్టుబాటు ధరల చెల్లింపు, రైతులకు రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలతో రాష్ట్రముఖచిత్రం మారిపోయిందన్నారు. సీఎం కేసీఆర్ దార్శనికతతో రాబోవు సంవత్సరంలో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ జానబాయి, సర్పంచ్ సుమతి, తదితరులు పాల్గొన్నారు.

సెస్ చైర్మన్‌ను కలిసిన బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్



చైర్మన్ రామారావును సత్కరిస్తున్న వెంకటస్వామి

ముస్తాబాద్: సెస్ చైర్మన్‌గా ఎన్నికైన చిక్కాల రామారావును బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. సెస్ వినియోగదారులకు ముఖ్యంగా రైతులు, కార్మికులకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. ఏఎంసీ మాజీ చైర్మన్ అంజన్‌రావు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కిషన్‌రావు, సర్పంచ్ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకుడు రామ్‌మనోహర్‌రావు, వేణు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన మైనార్టీ నాయకుడు ఎండీ దస్తగిరి ఆదివారం కాంగ్రెస్‌లో చేరగా, పార్టీ మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లింగం, నాయకులు దేవయ్య, శ్రీనివాస్, రామ్‌రెడ్డి, బుచ్చాగౌడ్, బాబు, కిషన్, బాలయ్య పాల్గొన్నారు.

పక్కా భవనాలకు మోక్షం



శాభాష్‌పల్లి మహిళా సంఘం భవనంలో గ్రామపంచాయతీ

- పంచాయతీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు
- కొన్ని శిథిలావస్థలో, మరికొన్ని కమ్యూనిటీ భవనాల్లో
- అవస్థలు పడుతున్న పాలకవర్గాలు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని గ్రామాల్లో గ్రామపంచాయతీలు శిథిలావస్థలో చేరి, కొన్ని గ్రామాల్లో కమ్యూనిటీ భవనాల్లో గ్రామపంచాయతీ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామపంచాయతీలు ఇరుకుగా ఉండి, సమావేశాలకు ఇబ్బంది మారింది. ప్రభుత్వం ఇటీవల ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా గ్రామపంచాయతీలు మంజూరయ్యాయి. దాంతో నూతనంగా గ్రామపంచాయతీలు నిర్మించుకునే అవకాశం వచ్చింది.

కమ్యూనిటీ భవనాల్లో గ్రామపంచాయతీలు

మిడ్ మానేరు ప్రాజెక్ట్ ముంపునకు గురైన గ్రామమైన శాభాష్‌పల్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం నిర్మించకపోవడంతో మహిళా సంఘం భవనంలో కొనసాగుతోంది. మహిళా సంఘం సమావేశం, గ్రామపంచాయతీ గ్రామసభ ఒకే రోజు నిర్వహించాల్సి వస్తే, ఇబ్బంది అవుతోందని గ్రామస్తులు ఆరోపించారు. అలాగే ముంపు గ్రామమైన గుర్రవానిపల్లి ఆర్అండ్ఆర్ కాలనీలో గ్రామపంచాయతీ భవనం లేకపోవడంతో కమ్యూనిటీ హాల్‌లో రెండు చిన్న గదుల్లో నెట్టుకొస్తున్నారు.

శిథిలావస్థలో గ్రామపంచాయతీలు

అలాగే మండలంలోని ఆరెపల్లి, చంద్రగిరి గ్రామంచాయతీలు ఇరుకుగా చిన్నగా రెండు గదుల్లో ఉండి పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. గ్రామసభలు, సమావేశాలు ఏర్పాటు చేయాలంటే ఇబ్బందిగా మారింది. ఇటీవల గ్రామపంచాయతీ కార్యాలయం నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కమ్యూనిటీ భవనంలో పంచాయతీ



గుర్రవానిపల్లి మిడ్ మానేరు ముంపులో మునిగింది. మారుపాక శివారులోని సిరిసిల్ల–వేములవాడ రహదారి పక్కన కాలనీ ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయం లేక కమ్యూనిటీ భవనంలో గ్రామపంచాయతీ ఏర్పాటు చేశారు. ఇటీవల నిధులు మంజూరయ్యాయి.

– గుర్రం లక్ష్మారెడ్డి, సర్పంచ్, గుర్రవానిపల్లి

సంతోషంగా ఉంది



ఆరెపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఇరుకుగా, శిథిలావస్థలో ఉంది. దాంతో నూతన గ్రామపంచాయతీ కార్యాలయం కావాలని ప్రభుత్వానికి విన్నవించడం జరిగింది. ఇటీవల గ్రామపంచాయతీ నిర్మాణానికి నిధులు మంజూరు కావడం చాలా సంతోషం.

– ఇటుకల నవీన, సర్పంచ్, ఆరెపల్లి